RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 271 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | ఆదివారం 16 - 8 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### 'ఆయన చెప్పింది నిజమే'..
## రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

**హైదరాబాద్,ఆగస్టు 15:**కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరుతో కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్అన్నారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ. 5-6 లక్షలు ఇవ్వాలంటే ప్రభుత్వం 500 నిబం ధనలు పెడుతోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు.

## విలీనంపై సీఎం ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 15:**జమ్మూ కశ్మీర్ ప్రత్యేక హోదా రద్దు, రాష్ట్ర హోదా ఉపసంహరణ 2019లో జరగకపోయి ఉంటే.. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలే స్వచ్ఛందంగా తిరగబడి జమ్మూ కశ్మీర్‌లో విలీనమయ్యేవారని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని, మాట్లాడిన ఆయన.. 1947లో పాకిస్థాన్ గిరిజన దండయాత్రను తిప్పికొట్టి భారత్‌లో చేరాలని కశ్మీర్ ప్రజలు తీసుకున్న నిర్ణయం సరైనదేనని ç్రాశీఖలోని ప్రస్తుత పరిస్థితులు రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై జరుగుతున్న దాచకాన్ని చూసి తాను ఎంతో వేదనకు గురవుతున్నానని అబ్దుల్లా అన్నారు.

### ఎర్రకోటలో తొలిసారి
# పూర్తిగా వందేమాతరం గేయం..

ఢిల్లీ, ఆగస్టు 15: దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. ఇదే సమయంలో వందేమాతరం గేయాన్ని ఆలపించారు. దేశ చరిత్రలో ఎర్రకోటపై వందేమాతరం గేయాన్ని (ఝుఅనవ వీఝుతీఝుఎ) పూర్తిగా ఆలపించడం ఇదే ప్రథమం. అనంతరం జాతీయ గీతం 'జన గణ మన'ను ఆలపించారు.

ఆ సమయంలో భారత వాయుసేన చెందిన రెండు ఎంఐ-17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఒక హెలికాప్టర్ జాతీయ జెండాను.. మరొకటి 'వందే మాతరం' అని రాసి ఉన్న పతకాన్ని తీసుకెళ్లి.. ఆకాశంలో కనువిందు చేశాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తైన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేకకార్యక్రమాలు జరుగుతోన్నాయి. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరా



నికి కేంద్ర ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది.

### వందేమాతరం గీతాన్ని అడ్డుకున్న సోనియా గాంధీ..?
# ఇరకాటంలో కాంగ్రెస్ అధినేత్రి

**న్యూఢిల్లీ,ఆగస్టు 15:**దేశ 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ కాంగ్రెస్ అగ్రనేత, సీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం 'వందేమాతరం' గీతాలాపన జరుగుతుండగా.. ఆమె గేయాన్ని మధ్యలో ఆపాలంటూ అభ్యంతరం వ్యక్తం చేసిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. జాతీయ గేయం కొనసాగుతుండగానే సోనియా గాంధీ 'ఆపండి' అంటూ చేతులతో సైగలు చేయడం, పక్కనే ఉన్న మల్లికార్జున ఖర్గే రాహుల్ గాంధీలతో అసహనంగా వాదించడం, ఆ వెంటనే నిర్వాహకుడిని పిలిచి గీతాన్ని నిలిపివేయాలని ఆదేశించినట్లు ఉన్న వీడియో వైరల్‌గా మారింది. జాతీయ గేయం ఆలాపనను అవమానించేలా మధ్యలోనే అడ్డుకోవడంపై నెటిజన్లు, విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి.



దేశ స్వాతంత్ర్యోద్యమానికి ప్రాణవాయువు గా నిలిచిన 'వందేమాతరం' పట్ల కాంగ్రెస్ అగ్ర నాయకత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అంటూ నెట్టింట ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి బీభత్సం..
## ఐదుగురు సైనికులు గల్లంతు

అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. శుక్రవారం సాయంత్రం వేర్వేరు జిల్లాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఐదుగురు ఆర్మీ సిబ్బంది గల్లంతవగా, నలుగురు కూలీలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడమే ఈ దుర్ఘటనలకు ప్రధాన కారణం. దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని పసు పానీ ఆర్మీ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షం కారణంగా వచ్చిన ఆకస్మిక వరద, 5వ గ్రెనేడియర్‌కు చెందిన రెండు షెల్టర్లను ముంచెత్తింది. ఈ వరద ఉధృతిలో ఏడుగురు సైనికులు కొట్టుకుపోగా, వారిలో ఇద్దరిని సిబ్బంది సురక్షితంగా రక్షించారు. గల్లంతైన మరో ఐదుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు, అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో మరో దుర్ఘటన చోటుచేసుకుంది. కియోజరింగ్-బయాచింగ్ రహదారి నిర్మాణ పనుల వద్ద కొండచరియలు విరిగి పడ్డాయి. ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకోగా, నలుగురు కార్మికులు మరణించి ఉంటారని అధికారులు భావిస్తున్నారు.



# నల్గొండ నా ఊపిరి.. అభివృద్ధే నా ధ్యేయం
## నల్గొండలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ :నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ నేల చూపిన త్యాగం, ఆత్మగౌరవం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకలని అభివర్ణించారు. తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 5.35 లక్షల మంది రైతులకు రూ. 715 కోట్ల రైతు భరోసా, 1.99 లక్షల మంది పింఛనుదారులకు రూ. 51.28 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 17,873 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 4,360 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, 2.56 లక్షల కుటుంబాలకు



గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరిం చారు.పట్టణంలో 24 గంటల మంచినీటి సరఫరా లక్ష్యంతో రూ. 83 కోట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, పట్టణాభివృద్ధి కోసం మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు.

# తెలంగాణలో సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం
## గోల్కొండ కోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం రేవంత్

హైదరాబాద్,ఆగస్టు 15: సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం తమది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గోల్కొండ కోటపై సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ.. ఈ ప్రభుత్వ 32 నెలల కృషి ఇప్పుడిప్పుడే కనిపిస్తోందని.. తలసరి ఆదాయంలో టాప్‌లో ఉన్నామన్నారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతు బాగుంటేనే.. రాష్ట్రం బాగుంటుందన్న ముఖ్యమంత్రి.. రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టామన్నారు. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లు పెట్టుబడి సాయంఅందించామని చెప్పారు. అలాగే, రైతు సంక్షేమం కోసం రూ.లక్షా 70వేల కోట్లు, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని వివరించారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించి తీరుతామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తామన్నారు. త్వరలోనే పాలమూరు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వ్యవసాయ ంతో పాటు ఇళ్లకు ఉచిత కరెంట్ ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి కింద ఆడబిడ్డలకు రూ.4,790 కోట్లు అందజేశామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, 2 విడతల్లో 5.50లక్షల



ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్లు నిర్మించి అందించనున్నా మని తెలియజేశా రు. దేశంలోనే తొలిసారి తెలంగాణలో కులగణన జరిగిందని.. తెలంగాణ ఒత్తిడి వల్లే కేంద్రం జనగణనలో కులగణన చేర్చిందని తెలిపారు.

### ఒక గంట సమయం ఇవ్వండి..
# యువతను కోరిన మోదీ


**న్యూఢిల్లీ,ఆగస్టు 15:**'దిమాగీ నక్సల్స్' ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని, సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ప్రధాని మోదీ తెలిపారు. మనం వారిని గుర్తించి.. ఏకాకిని చేయాలని మోదీ సూచించారు. 3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది నక్సలిజం పోరాటంలో అమరుల య్యారని, ఇది యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికంటే ఎక్కువని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు. 'నేను అందరినీ ఒక సాయం చేయాలని అడుగుతున్నాను. జనగణన విషయంలో ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో మీరు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగాఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం' అని మోదీ పేర్కొన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువతకు తీపి కబురు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని



అందిస్తున్నట్లు ప్రకటించారు. గడిచిన కొన్నేళ్లలో దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారత్‌లోకి వస్తున్నాయని, మన యువత స్వదేశంలోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.


# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ
## సీఎం చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం

**అమరావతి,ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. రాష్ట్రాన్ని వికాసం నుంచి వైభవం వైపు, సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ఐదున్నర కోట్ల మంది ఆంధ్రులు సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. "భారతీయులకు, ప్రపంచవ్యా ప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దశాబ్దాల పోరాటం, ఎందరో మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు కన్న కలలను సాకారం చేసి, 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడదాం. ఈ దేశానికి మనమేం ఇవ్వగలమని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. రాబోయే20ఏళ్లు దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్, మనం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఐక్యంగా ఈ లక్ష్యాలను సాధిద్దాం" అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలావిధ్వంసానికి గురైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల అహంకారం, అవినీతి,



అరాచకాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించాం. గత 26 నెలల్లో విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే మా లక్ష్యం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాం"అని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. గత ప్రభుత్వ అప్పులను రీషెడ్యూల్ చేసి రూ.8,269 కోట్లు ఆదా చేశామని, రాష్ట్ర వృద్ధి రేటును 11.3 శాతానికి పెంచామని వివరించారు.

# బెంగళూరులో ఉగ్ర కుట్ర భగ్నం
# టెక్ కంపెనీ సెక్యూరిటీ గార్డ్ అరెస్ట్..!



బెంగళూరులో భారీ ఉగ్ర కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఉగ్ర వాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసాఫుల్ మాలిక్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని జిగాని ప్రాంతంలో ఉన్న ఒక ప్రముఖ టెక్ కంపెనీలో అతను గత ఏడాది కాలంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బొమ్మసంద్ర ఇండస్ట్రియల్ ఏరియా పోలీసులు సాధారణ పెట్రోలింగ్‌లో భాగంగా ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా ఉంచారు. ఈ క్రమంలో మాలిక్ కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో శుక్రవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

అఫ్ఘనిస్థాన్‌లోని తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) హ్యాండ్లర్‌తో మాలిక్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. త్వరలోనే అఫ్ఘనిస్థాన్‌కు వెళ్లి ఆ ఉగ్రవాద సంస్థలో చేరేందుకు అతను సిద్ధమవుతున్నట్లు వెల్లడైంది.

భారత్, పాకిస్థాన్‌లలో దాడులు చేసేందుకు ప్రణాళికలు రచించడంపై వీరిమధ్య చర్చలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి పాకిస్థానీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ తాజా పరిణామంతో బెంగళూరులో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

# సంపాదకీయం

## ఎన్నాళ్లీ లీకులు..?

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతం లో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీకి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్దీ అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేదిఈపరీక్ష రాసినవిద్యార్థుల గుండెల్లో దిగిన బాకుమాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటిది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకుపరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు. అవి గుండెలమీద పడే బరువులాఅనిపిస్తాయి. పాపం, పుణ్యం తెలియకు ండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకువస్తుందని ఫలితాలకోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదం డ్రులు తల్లడిల్లిపోతు న్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించా రు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు. మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశయం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భయం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు. పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం. ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం. కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు. నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చది విన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు. అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అ నే ప్రశ్నలూ ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవు తుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు. నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటేజ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడు చాలామంది విద్యా ర్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి కాదు, ప్రశ్నకు సరైన సమాధానంగుర్తుపెట్టుకోవడానికిమాత్రమే చదువుతు న్నారు. పాఠశా లలు విద్య నేర్పే స్థలాలుగా కాకుండా, పరీక్షలకు సిద్ధం చేసే గదులుగా మారిపోతున్నా యనే విమర్శలు పెరుగుతు న్నా యి. కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ విద్యార్థుల ఆశలను మాత్రమే కాదు, వారి భయాలను కూడా వ్యాపారంగా మార్చేసిందిఉదయం నుంచి రాత్రి వరకు టెస్టులు, ర్యాంకులు, పోలికలు, ఒత్తిళ్లు... ఇవన్నీ కలిసి విద్యార్థి బాల్యాన్ని మెల్లగా మింగేస్తున్నాయి. డాక్టర్ కావాలనే కల ఇప్పుడు చాలామందికి సేవాభావం కంటే బతుకుపోరాటంగా మారిపో యింది.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

## ఎడపల్లి మండలంలో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలు... రెప రెపలాడిన మువ్వన్నెల జెండా...

**ఎడపల్లి,ఆగస్టు 15:(ప్రజా గళం)**ఎడపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దత్తాద్రి,ఎంపి డిఓ కార్యాలయంలో ఎంపిడిఓ శంకర్,పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ ముత్యాల రమ,జాతీయ జెండాను ఎగురవే శారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కందగట్ల రాంచందర్ జాతీయ జెండా ఎగు రవేశారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో సిద్దిరామేశ్వర్,సహకార సంఘ కార్యాలయంలో చైర్మన్ పోల మల్కారెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ దళిత సంఘం ప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేశారు. చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో జాతీ య జెండా ఎగురవేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వద్ద సర్పంచ్ కందగట్ల రాంచందర్ జాతీయ పతాకం ఎగురవేశారు. జాతీయ జెండా ఆవిష్కరణకు ముందు కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో డాక్టర్ వినీత్ కుమార్ రెడ్డి,ఐకెపి కార్యాలయంలో ఎపిఎం రాజేందర్,మండల విద్యా శాఖ కార్యాలయంలో ఏంఈ వో శివలింగ్ గాలప్ప,తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గంగాశంకర్,కేజీబివి కళాశాల లో స్పెషల్ ఆఫీసర్ దీపిక జాతీయ జెండా ఎగురా వేశా రు. అంబం(వై)గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గోపరి స్రవంతి సుమన్ జాతీయ జెండా ఆవి ష్కరించారు. ఏఆర్పీ క్యాంప్ లో సర్పంచ్ పురమల్ల వినోద్ కుమార్,బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్పంచ్ పురమల్ల హనుమంతు, జైతాపూర్ గ్రామంలో సర్పంచ్ నాగుల రాజు గౌడ్, వడ్డెపల్లిలో సర్పంచ్ కొమ్మెటి సత్యం,ధర్మారంలో సర్పంచ్ సుందు కిషన్,మంగళ్ పాడ్ గ్రామంలో సర్పంచ్ చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్, కుర్నాపల్లిలో సర్పంచ్ పరిగె సాయిలు,ఠాణాకలాన్ లో సర్పంచ్ గెంటే అలేఖ్య శ్రీనివాస్,జాన్కంపేట్ లో సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్,నెహ్రూనగర్ లో సర్పంచ్ ముస్కాన్ బేగం,పోచారం లో సర్పంచ్ నీరడి జ్యోతి రవికుమార్, బాపునగర్ గ్రామ పంచాయ తీ కార్యాలయంలో సర్పంచ్ నగునూరి అనురాధ రాజశేఖర్ లు త్రివర్ణ పతాకం ఎగురవేసి గౌరవ వంద నం స్వీకరించారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

**- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

**- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

**నిజామాబాద్, ఆగస్టు 15 ( ప్రజాగళం ప్రతినిధి)** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగారాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మీదట, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, డెయిరీ, పశు సంవర్ధక, అటవీ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, నీటి పారుదల, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ను సందర్శించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి, ఆర్టీసీ, విద్యుత్, పౌర సరఫరాలు, హౌసింగ్ తదితర శాఖల శకటాల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పతకాలు పొందిన పోలీసులకు మెడల్స్ బహూకరించారు. స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. కంజర రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, విశ్వ వికాస్ హైస్కూల్, నవీపేట్ బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు, టైం స్కూల్ చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి పి.సుదర్శన్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్ .భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ట్రైనీ కలెక్టర్ సురేష్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.




## స్నేహ సొసైటీలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**నిజామాబాద్, సిటీ ఆగస్టు 15)( ప్రజాగళం )**శాంతి, అహింస,సాయుధ విప్లవ పోరాట ఉద్యమాలతో ఎందరో మహనీయులు భారత స్వాతంత్ర్యం కోసం పోరాడడం జరిగిందని విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సవితారాణి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.. ఈ సందర్భంగా డాక్టర్ సవిత రాణి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం వందల ఏళ్ల పాటు బానిస సంకెళ్ళ విముక్తి కోసం స్వాతంత్రం నా జన్మ హక్కు అనే నినాదంతో తమ ప్రాణాలను సైతం అర్పించడం వల్ల స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు.. అలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచి దేశ సమైక్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం దేశభక్తి గీతాలతో పలు సాంస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించారు.. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన విశ్రాంత ఉత్తమ ప్రధానోపాధ్యాయులు దాసరి విజయానందరావు మాట్లాడుతూ 150 సంవత్సరాలకు పైగా బానిస సంకెళ్ల మధ్య దేశ ప్రజలు ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందన్నారు.. అలాంటి సమయంలో శాంతి, అహింస, సాయుధ, విప్లవోద్యమాలతో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ ను ఏర్పాటు చేసి పోరాటాలు చేయడం జరిగిందన్నారు అలాగే అల్లూరి సీతారామరాజు తుపాకీ కి ఎదురెళ్లి మరి పోరాటం చేసి వందేమాతరం అంటూ ప్రాణాలర్పించిన గొప్ప వీరులని కొనియాడారు.. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని నేటి బాలలు, యువత , పెద్దలు ప్రతి ఒక్కరు బాధ్యతగా దేశ సమైక్యత, ప్రపంచ నలుమూలల చాటే విధంగా దేశ గొప్పతనాన్ని తెలియజేసే దిశగా కృషి చేయాలన్నారు.. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మానసిక దివ్యాంగ విద్యార్థులకు అంద విద్యార్థులకు ఏర్పాటుచేసిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులు బహుమతులను అందజేశారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులను శాలువలు జ్ఞాపికాలతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ కోశాధికారి తాటి సుధాకర్, జాయింట్ సెక్రెటరీ షేర్ల దయానంద్ , వర్గ సభ్యులు రమణారెడ్డి, లోకల్ కమిటీ చైర్మన్ బాబా గౌడ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నిరంజన్ ప్రసాద్ , దాత వేదవతి కులకర్ణి, స్నేహ సొసైటీ ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## బోధన్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు...

**జాతీయ పతాకం ఆవిష్కరణ చేసిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు,కౌన్సిలర్ అంకు దాము...**

**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 15(ప్రజా గళం)**భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కుని బోధన్ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివా రం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ సమీపంలోని నెహ్రూ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,మున్సిపల్ కౌన్సిలర్ అంకు దాము జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా జాతీయ త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం సమర్పించి,స్వాతంత్ర్య సమరయో ధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు పాషా మొయినుద్దీన్,నక్క లింగారెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగిస్తూ దేశ అభివృద్ధి,ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత,దేశభక్తిని చాటుతూ వేడుకలు ఉత్సాహంగా సాగాయి.



## ప్రెస్ క్లబ్ భవనంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఆర్మూర్, ఆగస్టు 15:(ప్రజగళం/ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో నవనాథపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుంకరి గంగా మోహన్ జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ పతాకానికి వందనం చేశారు. బ్రిటిష్ వారి కబంధహస్తాల నుంచి దేశాన్ని విముక్తి చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవనాథపురం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు సాత్ పుతే శ్రీనివాస్,మాజీ నవనాథపురంప్రెస్ క్లబ్ అధ్యక్షులు మంచిర్యాల నరేందర్ ప్రధాన కార్యదర్శి మ్యాకల దినేష్, చిన్న, రాజేందర్, చక్రి, సాయి ప్రణీత్, షికారి శ్రీనివాస్, యయాపై, చరణ్ గౌడ్, వెంకటేశం, సుదర్శన్, అరుణ్, క్రాంతి, శ్రావణ్, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల పార్కులో ఘనంగా జండా పండగ

**-వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో**

**తొలిసారిగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**



**నిజామాబాద్ సిటీ , ఆగష్టు 15( ప్రజాగళం )**వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ తెలంగాణ అమరవీరుల పార్కులో మొదటిసారిగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ స్రవంతి రెడ్డి జండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలందరికీ 80 వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ సిటిజన్ సభ్యులకు శాలువాతో సత్కరించారు. జైహింద్, భారత్ మాతాకీ జై అంటూ ఘనంగా నినాదాలు చేశారు. స్వాతంత్రం కోసం పోరాడిన నాయకులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు ఆయుష్ పురుషోత్తం, వినోద్ కుమార్, కొట్టూరు రమేష్, రాజేందర్, శ్రీనివాస్ గౌడ్, రామరాజు,సిద్ధిరాములు, సాయ గౌడ్, శ్రీనివాస్,సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**- డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత పారదర్శకత, జవాబుదారీతనం**

**- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి - పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు**



**నిజామాబాద్, ఆగస్టు 15 ( ప్రజా గళం ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిజామాబాద్ లో శనివారం పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు జ్యోతి ప్రజ్వలన చేసి, జయ జయహే తెలంగాణ గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత కలిగిన వారి తరహాలోనే నిరుపేద కుటుంబాలు కూడా మూడు పూటల అన్నం తినాలనే ఉదాత్తమైన ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ఇదివరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం అందించిన దొడ్డు బియ్యం తినడానికి ఉపయోగపడక 70 శాతం అమ్ముకునే వారని, సబ్సిడీ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలిపోయేదని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో పేదలకు ఆహార భద్రత భరోసా ఏర్పడిందని అన్నారు. డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం తీసుకువచ్చిందని తెలిపారు. పేదల కోసం ఉద్దేశించిన రేషన్ సన్న బియ్యం ఒక్క గింజ కూడా పక్కదారి పట్టకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. స్మార్ట్ కార్డుల వల్ల లబ్ధిదారులకు రేషన్ పొందడంలో మరింత సౌలభ్యం కలుగుతుందని, ఎక్కడి నుంచి అయినా ఈ కార్డు ద్వారా రేషన్ సరుకులు పొందే వెసులుబాటు లభించిందని అన్నారు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. సంక్షేమంతో పాటు మౌలిక వసతులు, వ్యవసాయం, విద్య, ఉపాధి, ప్రజా సేవల రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం నిరంతర కృషిని కొనసాగిస్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో 4.77 లక్షల కుటుంబాలకు డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం సైతం తప్పిపోకుండా ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా ఈ కార్డులను పంపిణీ చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని అన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తొమ్మిది రకాల భద్రతా ప్రమాణాలను జోడిస్తూ డిజిటల్ రూపంలో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల నకిలీ, బినామీలు, రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, అర్హులైన వారికి నేరుగా ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సంక్షేమానికి రైతు భరోసా, మహిళలకు అండగా కళ్యాణ లక్ష్మి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కొత్త రేషన్ కార్డుల జారీపై తగిన దృష్టి పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టిందని గుర్తు చేశారు. డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టడం ద్వారా రేవంత్ రెడ్డి




ప్రభుత్వం ప్రజాపాలనలో మరో కీలక ముందడుగు వేసిందన్నారు. సాంకేతికత ఆధారిత పాలన ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, 2047 నాటికి రైజింగ్ తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డిలు మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం దక్కేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎక్కడ కూడా అక్రమాలకు తావులేకుండా జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. గత సీజన్ లో ధాన్యం విక్రయాలకు రైతులు ఒకింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, రేషన్ డీలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మెన్,పాలకవర్గం ప్రమాణ స్వీకారం...

**ఆలయ అభివృ ద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి....ఆలయ కమిటీకి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ సూచన...ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి... పులి శ్రీనివాస్ వెల్లడి...**

**ఎడపల్లి,ఆగస్టు 24:(ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రా మంలోని కొండపై వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన టువంటి శ్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం తెలంగాణ లోని యాదగిరి గుట్ట తర్వాత జాన్కంపేట్ శ్రీలక్ష్మినర సింహ స్వామి ఆలయమని,ఈ ఆలయం ప్రక్యాతిగాం చిందని కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ అన్నారు.శ్రీ లక్ష్మీనరసింహ స్వామీ దేవస్థానం నూతన కమిటీ చైర్మెన్ గా చిలుక రవితో పాటు పాలక వర్గ సభ్యులు శుక్రవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు.వీరి చేత ఎండోమెంట్ ఇన్స్ స్పెక్టర్ సుజాత రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు నూతన కమిటీ పాలకవర్గం సభ్యులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కొండమ చార్యులు,కృష్ణ మాచార్యులు వారి చేత అభిషేకం,పూజకార్యక్రమాలు చేయించి తీర్థ ప్రసా దాలు అందజేశారు.అనంతరం చైర్మెన్,కమిటీ డైరెక్టర్ లను ఆలయ కార్యనిర్వహణ అధికారి గింజుపల్లి వేణు,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్,కాంగ్రెస్ నాయకు లు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భం గా పులి శ్రీనివాస్ మాట్లాడుతూ..ఎంతో ప్రసిద్ధి గాంచిన ఆలయానికి ధర్మకర్తలుగా ఎన్నుకోబడ్డారంటే మీరు ఎంతో పుణ్యం చేసుకొని ఉంటారని అన్నారు.అలాగే ఈ రోజు ఆలయ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయడం స్వామివారికి సేవ చేసుకునే భాగ్యం మీకు కలిగిందని అన్నారు.ప్రభుత్వ ప్రధాన సలహాదారు, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆశీస్సులతో ఆలయ కమిటీ నియామకం,ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగింది అని తెలిపారు. ఆలయ కమిటీ ధర్మకర్తలుగా నియామ కం అయ్యాకా,గుడిలో ఉన్నా,బయట ఉన్నా గుడి అభివృద్ధిపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యర్థం ఆలోచించాలని అన్నారు.పదవికాలంలో ఉన్నన్ని రోజులు నీతిగా,న్యా యంగా, ధర్మంగా,పనిచేయాలని సూచించారు.ఇటీవల దాతలు ఆలయం ప్రాంగాణంలోని పవిత్ర అష్టముఖి కోనేరు అభివృద్ధి కోసం ముందుకు రావడం జరిగింది అని,వారు కోనేరు కూడా చూసి వెళ్లడం జరిగింది అని తెలిపారు.అర్కిస్ట్ లు కూడా రావడం జరిగింది వారు కూడా త్వరలో పనులు చెప్పాడుటారని అన్నారు.ప్రతి కార్యక్రమానికి కమిటీ సహకారం ఉండాలని,దీనికి తోడుగా మా సహకారం కూడా తొడవుతుందని,దింతో ఆలయ అభివృద్ధికి మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని చెప్పారు.దేవస్థానం కింద ప్రాంగణంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ భవనం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరుగుతుం ది అని,అనంతరం ఫంక్షన్ హాల్ నిర్వహణ బాధ్యతలు ఆలయ కమిటీకి అప్పగించడం జరుగుతుంది అని తెలిపారు.ఈ కమిటీ ముసు ముందు ఆలయ అభివృ ద్ధి చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంచనకోట అనురాధ కిషన్ గౌడ్,ఉపసర్పం చ్ నీలం కృష్ణ,ఆలయ చైర్మెన్ చిలుక



రవి,కమిటీ డైరె క్టర్ లు గయక్వాడ్ మోహన్,బల్ల పసుల నర్సారెడ్డి, ఉడుత గంగాధర్,జింక లక్ష్మిలింగం,సాప్లే సంజయ్, మెట్టు రాజు,శ్రీరంగం కొండమాచార్యులు,ఎండో మెంట్ ఇన్స్ స్పెక్టర్ సుజాత రెడ్డి,ఈవో.గింజపల్లి వేణు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటీ లింగం,ఆత్మ చైర్మన్ కృష్ణ రావు, నాయకులు శంకర్ నాయుడు,టి.విజయ్ కుమార్ గౌడ్, మిద్దె చిన్నయ్య, తాహేర్,జింక లింగం,చిక్కెల లక్ష్మణ్, జక్కం బాల్ లింగం ,గంగప్రసాద్,క్రాంతి,ఆర్.లక్ష్మణ్ బాబు,శ్రీనివాస్,ఎంబ మోహన్ ,సృజన్, రహీమ్,సర్పం చ్ ల ఫోరం అధ్యక్షుడు నాగుల రాజుగౌడ్,సర్పంచ్ లు గెంటేఅలేఖ్య శ్రీనివాస్,సుండు కిషన్,దొడ్డి శ్రీనివాస్,చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్,గోపరి స్రవంతి సుమన్,బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు,ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ, సిబ్బంది,గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సాయినాథ్ టవర్స్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్ సిటీ ఆగస్టు 15 (ప్రజాగళం)** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ శ్రీనగర్ కాలనీలో గల సాయినాథ్ టవర్స్ అపార్ట్మెంట్ లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అపార్ట్మెంట్ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి, వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్ కమిటీ అధ్యక్షులు కే. వి.రఘు మాట్లాడుతూ, ఎందరో త్యాగ ధనుల పోరాట ఫలితంగా భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశభక్తి పెంపొందే విధంగా వందేమాతరం గీతాన్ని ఆలపించడం జరిగిందన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం స్వీట్లు పంచుకొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిం చారు.ఈ పంద్రాగస్టు వేడుకల్లో అపార్ట్మెంట్ ప్రతినిధులు పెంటూ మోహన్, ప్రశాంత్, రమణ, జనార్ధన్, సత్యనారాయణ, రమేష్, రవి, శారద, రోజా, ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపల్లి కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లో త్రివర్ణ పతాకవిష్కరణ

**- జెండాను ఆవిష్కరించిన బ్యాంక్ మేనేజర్ కొట్టూరు ప్రశాంత్**



**కామారెడ్డి, ఆగస్టు 15( ప్రజాగళం )**కామారెడ్డి జిల్లాలోని దేవుని పల్లి కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.బ్యాంక్ మేనేజర్ కొట్టూరు ప్రశాంత్ జాతీయ జెండాఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోపరేటివ్ బ్యాంకుల వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని, రైతులతోపాటు ఇతర రంగాల్లో ఉన్న వారికి కూడా , కోపరేటివ్ బ్యాంకుల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకాలు అమలుకు కోపరేటివ్ బ్యాంకు ఎప్పుడు ముందుం టుందని, మేనేజర్ కొట్టూరు ప్రశాంత్ పేర్కొన్నారు..ఇతర వాణిజ్య బ్యాంక్ ల కన్నా తక్కువ వడ్డీ తొ కర్షక మిత్ర. గోల్డ్ లోన్ సదుపాయం. అధిక వడ్డీతొ కూడిన డిపాజిట్ సౌకర్యం కలదన్నారు. తమ బ్రాంచ్ లో లాకర్ సదుపాయం ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది మౌనిక. శ్రీహరి, స్వప్న, ఖాతదారులు , విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే దేశ భవిష్యత్తు, క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తితో ముందుకు సాగాలి

**- ఎన్ సీ సీ జనరల్ కల్నల్ ప్రేమ్ జిత్**

**- నిర్మల హృదయ హై స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**నిజామాబాద్ సిటీ,ఆగస్టు 15: (ప్రజా గళం)** విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తితో ముందుకు సాగాలని ఎన్ సీ సీ జనరల్ కల్నల్ ప్రేమ్ జిత్ స్పష్టం చేశారు. శనివారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగానిర్మల హృదయ హై స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, క్రమశిక్షణ, ఉత్సాహం వైభవంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ఎన్ సీ సీ జనరల్ కల్నల్ ప్రేమ్ జిత్ అధికారి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ రెవ డా: యూ . నిర్మల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలురెవ సిస్టర్ సరిత సింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రెవ సిస్టర్ ఇన్నాలు, తెలుగు మీడియం ఇన్‌చార్జ్ రెవ సిస్టర్ సుందరి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు తమ శుభాకాంక్షలు అందించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్ సీ సీ జనరల్ కల్నల్ ప్రేమ్ జిత్ అధికారి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేశారు.జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థినిలు చేసిన మార్చ్‌పాస్ట్ చూపరులకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వివిధ హౌస్‌లకు చెందిన విద్యార్థులు పూర్తి క్రమశిక్షణతో, సమన్వయంతో, ఉత్సాహంతో మరియు దేశభక్తి భావంతో మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల అడుగుల్లోని సమన్వయం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు దేశభక్తి భావం అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథి మార్చ్‌పాస్ట్‌ను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కల్నల్ ప్రేమ్ జిత్ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని పేర్కొంటూ, క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తి, నైతిక విలువలు మరియు సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ ప్రతిభను దేశ ప్రగతికి వినియోగించాలని సూచించారు.పాఠశాల సుపీరియర్ తన సందేశంలో స్వాతంత్ర్యం మనకు అందించిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుచేస్తూ, విద్యార్థులు ప్రేమ, ఐక్యత, సేవాభావం మరియు మంచి పౌరసత్వాన్ని జీవితంలో ఆచరించాలని ప్రేరేపించారు. సమాజానికి సేవ చేయడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నిజమైన గౌరవం ఇవ్వాలని సూచించారు.అనంతరంపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెవ సిస్టర్ సరిత సింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్సిసి ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. “మన దేశం మన గర్వం -- మన బాధ్యత మన భవిష్యత్తు” అనే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి దేశ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించాలని




ఆకాంక్షించారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తి, భారతీయ సంస్కృతి , జాతీయ ఐక్యతను అద్భుతంగా ప్రతిబింబించాయి. విద్యార్థుల దేశభక్తి గీతాలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులు, అతిథులు మరియు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానంగా మార్చ్ ఫాస్ట్ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి. విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనలను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు మరియు సందర్శకులు హాజరై కార్యక్రమాన్ని ఉత్సాహంగా ఆస్వాదించారు. ప్రతి ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన లభించింది.విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది సమష్టి కృషి, అంకితభావం మరియు సమన్వయంతో ఈ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతంగా, చిరస్మరణీయంగా ముగిశాయి.

## ఎడపల్లిలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు....



**ఎడపల్లి,ఆగస్టు 15: (ప్రజా గళం)**ఎడపల్లి మండల కేంద్రంలోని స్థానిక మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సంఘం వద్ద శనివారం 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించా రు.సంఘం అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాస్ జాతీయ పతాకం ఎగుర వేసి జాతీయ గీతం ఆలపించి గౌరవ వందనం స్వీకరించారు.ఎందరో మహనీయుల ఉద్య మ,పోరాటం వల్ల మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిం చ్చిందని,నేడు మనదేశంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా పండుగ వాతావరణంల నిర్వహించుకోవడం జరుగుతుంది అని అయన తెలిపారు.మన దేశాన్ని గౌరవిస్తూ జాతీయ జెండా పండగను ప్రతి ఒక్కరు జరుపుకోవాలని,జాతి నేతల అడుగు జాడలో నడుద్దామని పిలుపునిచ్చారు.అట్లాగే మున్నూరు కాపు సంఘ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామని బొబ్బిలి శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్ర మంలో కుల సంఘం ప్రతినిధులు వార్డు సభ్యుడు అరుణ్,ఆకుల సంతోష్,కటకం శంకర్,అల్లాడి శ్రీను, కంజర్ రామకృష్ణ,కంజర్ సత్యనారాయణ,కటకం సుధాకర్,కంజర్ రామకృష్ణ,కంజర్ రవి శంకర్,బర్దిపూర్ ప్రవీణ్,ద్యాకం సాయిరెడ్డి,కంజర్ నాని,తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాద్ తండాలో ఘనంగా స్వతంత్ర వేడుకలు

**- జెండాను ఎగరవేసిన సర్పంచ్ నందిని సంతోష్ నాయక్**

ఆర్మూర్ ఆగస్టు 15 (ప్రజాగళం)మాక్లూర్ మండలం అమ్రాద్ తాండ గ్రామంలో 80 వ స్వతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామ సచివాలయ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ నందిని సంతోష్ నాయక్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ స్వతంత్ర దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. త్యాగదనులు, వీరులు పోరాడి తెచ్చుకున్న స్వతంత్రం అన్నారు. ఈ సందర్భంగా త్యాగదనుల గురించి కొనియాడారు. విద్యార్థులకు అంశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం మిఠాయిలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్ నాయక్ వార్డు సభ్యులుసుజాత ,మంజుల,కమల, మధు, గంగూబాయి, గణేష్, మహేందర్గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రవి, శంకర్,రంజనాయక్,మోహన్, నర్సింగ్,వసంత, కిషన్ ,శ్రీనివాస్ నాయక్ కార్యదర్శి స్నేహ,కారోబార్ మాన్ సింగ్ , ఉపాధ్యాయులు,



విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# వెంకటేశ్ - త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్



టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్- దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితేఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ -- త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో - దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.


# బాలయ్య-కొరటాల మూవీకి క్రేజీ అప్‌డేట్..



టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న కాంబినేషన్లలో ఒకటిగా మారిన నటసింహం నందమూరి బాలకృష్ణ - దర్శకుడు కొరటాల శివ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే సినిమా కోసం బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలోని సెకండ్ హాఫ్‌లో వచ్చే కీలక ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ కోసం బాలకృష్ణ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నారట. ముఖ్యంగా ఈ పాత్ర కోసం ఆయన హెయిర్ స్టైల్‌లో ప్రత్యేక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హాకిమ్ ప్రత్యేకంగా బాలయ్య కోసం కొత్త హెయిర్ డిజైన్ రూపొందిస్తున్నట్లు సమాచారం. కేవలం హెయిర్ స్టైల్ మాత్రమే కాదు, బాలకృష్ణ డ్రెస్సింగ్ స్టైల్‌లో కూడా మార్పులు చేయనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అభిమానులు చూడని విధంగా

అల్ట్రా స్టైలిష్ మాస్ లుక్‌లో నటసింహం కనిపించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రం షూటింగ్ విషయానికి వస్తే, ఆగస్టు నెలలో సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదటి షెడ్యూల్‌ను భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ప్రారంభించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

# ఎన్టీఆర్.. అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎ లాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.




# అప్పుడు ఇష్టం లేనిది.. ఇప్పుడు అలవాటైంది..



తొలినాళ్లలో కాస్తంత బొద్దుగా కనిపించిన కీర్తి సురేశ్, ఉన్నట్టుండి బాగా తగ్గింది. తను అనూహ్యంగా బరువు తగ్గి కనిపించడంతో ఆపరేషన్లు గట్రా చేయించుకుందంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడారు. సోషల్ మీడియాలో విమర్శలు కూడా ఎదురయ్యాయి. వీటిపై తాజాగా స్పందించింది కీర్తి సురేశ్. 'ఇప్పటివరకూ నా ఫిట్‌నెస్ గురించి ఎవరితో మాట్లాడలేదు. మొదట్లో జిమ్ అనేది నాకు సంబంధించింది కాదు, నా శరీరానికి వ్యాయామం అవసరం లేదు అనే ధోరణిలో ఉండేదాన్ని. కానీ 'మహానటి' తర్వాత వచ్చిన గ్యాప్, నా గురించి నేను ఆలోచించుకునే అవకాశాన్నిచ్చింది. వర్కవుట్లు మొదలుపెట్టి కేవలం 9 నెలల్లో పది కేజీలు తగ్గాను. లావుగా ఉంటానంటూ నన్ను బాడీ షేమింగ్ చేసినవారందరికీ సరైన సమాధానం ఇచ్చాను. ఒకప్పుడు జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఇప్పుడు జిమ్ చేయకపోతే ఏదోలా ఉంటుంది. ఇది అలవాటుగా మారడం బావుంది. ఒకప్పుడు చీరలోనే అందంగా ఉండేదాన్ని. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలొస్తున్నాయ్' అంటూ చెప్పుకొచ్చింది కీర్తి సురేశ్.

## తిలక్ వర్మతో అఫైర్ అంటూ వార్తలు...

# ప్రకటన విడుదల చేసిన శ్రీలీల టీమ్!



ప్రముఖ నటి శ్రీలీల, యువ క్రికెటర్ తిలక్ వర్మ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె టీమ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైన, అవాస్తవ కథనాలని అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలీల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది. "శ్రీలీల, తిలక్ వర్మకు సంబంధించి వ్యాప్తి చెందుతున్న పుకార్లు పూర్తిగా నిరాధారమైనవి, అసత్యమైనవి. వారిద్దరూ ఇప్పటివరకు ఒకరినొకరు కనీసం కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు కూడా. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. వాస్తవ నిర్ధారణ లేకుండా ఇలాంటి కల్పిత కథనాలను ప్రచారం చేయవద్దని కోరుతున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియా ఖాతాలతో పాటు పాటు కొన్ని మీడియా వేదికల్లోనూ కథనాలు వెలువడిన నేపథ్యంలో శ్రీలీల టీమ్ ఈ వివరణ ఇచ్చింది. వ్యక్తిగత విషయాలపై వార్తలు రాసేటప్పుడు మీడియా, సోషల్ మీడియా యూజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేసింది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై తరచూ ఇలాంటి పుకార్లు రావడం సహజమే అయినప్పటికీ, ఈ ప్రచారం ఎక్కువ కావడంతో వెంటనే స్పందించి పుకార్లకు అడ్డుకట్ట వేయాలని శ్రీలీల బృందం నిర్ణయిం చుకుంది. ఈ అధికారిక ప్రకటనతో శ్రీలీల, తిలక్ వర్మ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

# 'సావిత్రి' ఆటనే మార్చేస్తుందట..

రవికుమార్ సీరపు దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కుతున్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'(ం్థ్రవ =వం ధీుస్త్ర). హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీలో పాపులర్ నటి రాశీ కీలక పాత్రలో నటిస్తుంది. ఈ విషయాన్ని షేర్ చేస్తూ మేకర్స్ షేర్ చేసిన కొత్త అప్‌డేట్ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. రాశీ టీంలో జాయిన్ అయినట్టు తెలియజేస్తూ.. కొన్ని పాత్రలు కేవలం కథకు సపోర్ట్‌గా నిలుస్తాయి. కానీ సావిత్రి మాత్రం మొత్తం ఆటనే మార్చేస్తుంది.. అంటూ నయా అప్‌డేట్ షేర్ చేశారు మేకర్స్. సావిత్రి పాత్ర సినిమాకు బ్యాక్ బోన్‌గా ఉండబోతున్నట్టు తాజా న్యూస్ హింట్ ఇచ్చేస్తుంది. రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ఈ మూవీలో ప్రసాద్ బెహరా ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ది రెడ్ బ్యాగ్ మూవీ ప్రీ లుక్‌లో నలుగురు అమ్మాయిలతో రిలీజ్ చేసిన పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో సాగే డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చారు. మరో పోస్టర్‌లో చేతినిండా రక్తం, ఆ బ్యాగును పట్టుకున్న తీరు, అక్కడే ఉన్న కత్తులు, తుపాకులు, రక్తపుమయంగా మారిన ఏరియా ఇలా ప్రతీ ఒక్కటి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. రవికుమార్ సీరపు ది రెడ్ బ్యాగ్‌కు దర్శకత్వం వహిస్తుండటమే కాకుండా కథ, కథనం సమకూరుస్తున్నాడు. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్ బ్యాగులో ఏముంది.. అనేది టీజర్‌తో ఏమైనా హింట్ ఇస్తారేమో చూడాలి.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com